జ్యోతి మాసపత్రిక (మే, 69)

# సిఐడి

రైలు ఆగింది. నేను దిగవలసిన ఊరు వచ్చిందని గ్రహించి క్రిందకు దిగాను. అది చిన్న ఊరు. సాధారణమైన సందడికూడా లేదు.

అప్పటికి నలుమూలలా చీకట్లావరించుకున్నాయి. నాతోపాటు నలుగురైదుగురు మాత్రం ఆ స్టేషనులో దిగారు.

నేను వచ్చిన పని ఎంతవరకు సాధించగలుగుతానో తెలియదు.... నా వివరాలు ఎవరికీ

చెప్పకూడదు. ముందు బస ఏర్పాటు చేసుకోవాలి. స్టేషను మాస్టరు ఉండే గదివైపు నడిచాను.

ఆయన వయసు మళ్ళిన వ్యక్తి. గొంతు సవరించుకొని, '.....నేనీ ఊరికి అనుకోకుండా బయలు దేరవలసి వచ్చింది. ఈ ఒక్క రాత్రి ఉండడానికి హోటలువంటిదేదైనా ఉందాండీ!' అని అడిగాను.

ఆయన నన్నాపాదమస్తకం పరీక్షించి, 'ఈ ఊళ్ళో హోటలువంటిదేమీ లేదు కాని - ఒకరింట్లో మీకా ఏర్పాటు చేయగలను... వెంకన్నా!' అని ఎవరినో పిలిచాడు.

ఒక ముసలివాడు లాంతరు తెచ్చి అక్కడ బల్లమీద పెట్టి, 'ఏంటి బాబూ!' అని అడిగాడు.

'ఈయనకీపూట ఎక్కడేనా బస కావాలిట! సాంబయ్యగారింటికి తీసుకెళ్ళు' అని చెప్పాడాయన.

వెంకన్న ముఖంలో చిరునవ్వు మెరిసింది. 'మంచిదయ్యా!..... రండి బాబుగోరూ!' అని నావైపు చూసి నా చేతిలోని సూటుకేసు అందుకొని బయటకు నడిచాడు అతను. ఆయనకు కృతజ్ఞత చెప్పి వెంకన్న ననుసరించాను.

'ఈ ఊరికేం పనిబడి వచ్చారు బాబూ!' ముసలివాడు ఆరా తీస్తాడని నాకు తెలుసు. జవాబు సిద్ధంగానే ఉంది.

'ప్రభుత్వంవారు ఇక్కడి రైతుల అవసరాలను బట్టి పంపుసెట్లు, ట్రాక్టర్లు మంజూరు చేస్తారుట. వివరాలు తెలుసుకోవటానికి నన్ను పంపారు. రేపు వూళ్ళో అందర్నీ కలుసుకొని రాత్రి బండికి వెళ్ళిపోతాను. ఈ ఒక్కపూట తలదాచుకుంటే సరిపోతుంది. ఈ పూట బసకెంతవుతుంది వెంకన్నా?' అని మామూలుగా అడిగాను.

'తమరి చిత్తం. ఆరి ప్రాప్తం.....' అన్నాడు వెంకన్న అదోలా నవ్వుతూ.

ఉలిక్కిపడ్డాను. 'ఏమిటి నువ్వనేది?'

అంతలోనే అతనిగొంతు విషాదాన్ని నింపుకుంది. 'పాపం సాంబయ్యగారికి పక్షవోతం బాబయ్యా! మాట్రీ ఉద్యోగం చేసేవోడు. ఆయమ్మకి కలరా వచ్చి చచ్చిపోయింది. అరడజను మంది పిల్లలు....పెద్దమ్మాయి సుగుణమ్మే ఇల్లంతా చక్కబెట్టుకోవాలి. ఎవరూ చూసేవాళ్ళు లేరు. పిల్లలు మలమల మాడే రోజులొచ్చాయి. అప్పుడు నేను, స్టేషను మాట్టారు కలగజేసుకొని చిన్న వంటపూటిల్లు పెట్టుకోమని సుగుణమ్మకు సలహా ఇచ్చాము..... ఇంకేం చేత్తాం చెప్పండి. ఆరి మంచి చెడ్డ పైనుంచి చూడగలను కాని, బీదోడిని నేనేం చేయగలను? అందుకే మీ దయ - ఆరి ప్రాప్తం అన్నాను.....'

మనస్సు బరువెక్కింది. రెండు ఫర్లాంగులదూరం నడిచాక వీధికి చివరగా ఒక పెంకుటింటి ముందుకి తీసుకెళ్ళాడు వెంకన్న.

'ఇది వీరి సొంతయిల్లేనా?' అని అడిగాను.

'కాదు బాబూ! ఈ ఇంటిగలోరు పట్నంలో వుంటున్నారు. సాంబయ్యగారు అద్దెకుంటు న్నారు' అని ఇంటిలోకి చొరవగా వెళ్ళిపోయాడు వెంకన్న.

ఐదు నిముషాలసేపు అరుగుమీద నిలబడి నేను వచ్చిన పని ఎలా పూర్తిచేసుకోవాలా అన్న ఆలోచనతో గడిపాను. బస దొరికిందన్న తృప్తితో హృదయం తేలికపడింది.

వెంకన్నతోపాటు పన్నెండేళ్ళ కుర్రవాడు బయటకు వచ్చాడు. 'సుగుణమ్మ తమ్ముడండి' వెంకన్న పరిచయం చేశాడు.

'ఆహాఁ! నీ పేరేమిటి బాబూ!'

'మురళి'.

'మంచి పేరు' మురళి ముఖం మీద చిరునవ్వు చిందులు వేసింది.

'లోపలికి రండి బాబూ! మీ కన్ని ఏర్పాట్లు చేయించాను.'

వెంకన్న వెనకాల సావిట్లోకి నడిచాను. ఎడమవైపున ఉన్న గదిలోకి తీసుకు వెళ్ళాడతను.

పందిరిమంచం, దానిపై మెత్తగా, ఒత్తుగా, ఎత్తుగా దూది పరుపు. పైన తెల్లని దుప్పటి. ప్రక్కగా ఒక కుర్చీ - దాని ముందు టేబిలు, వారగా పెద్ద బీరువా - దానిమీద పొందికగా అమర్చిన నిలువుపాటి అద్దం, గోడలనిండా ప్రబంధ స్త్రీ మూర్తుల సుందర చిత్రాలు.

ఇదంతా కలకాదు కదా అనిపించింది. ఇంత చక్కగా అలంకరించిన ఆమె హృదయం ఎంత కళాత్మకమైనదో - అనుకున్నాను.

'ఇలా నడవలోంచి బయటకెడితే దొడ్లో నీళ్ళగదుంది బాబూ!..... మరో గంటకంతా సిద్ధమైపోతుంది.

'అందాకా రెస్టు తీసుకోండి తమరు. మరి నే వత్తానండయ్యా!'

'మంచిది. రేప్రొద్దున్నే అలా స్టేషనువైపు వస్తాను.'

'అలాగే రండి బాబూ!'

వెంకన్న వెళ్ళిపోయాడు.

'కాళ్ళు కడుక్కోండి' మురళి పలకరించాడు. ఎక్కడో గదిలో పిల్లల హడావిడి వినిపిస్తోంది.... ఇంతమందిని ఆమె తానొక్కత్తే ఎలా సముదాయించుకు వస్తోందో! ఆమె కూడా మురళి అంత అందంగా ఉంటుందా!

నా ఆలోచనలకి నవ్వు వచ్చింది. మురళి మళ్ళీ హెచ్చరించాడు. కాళ్ళు కడుక్కొని అలసిన శరీరాన్ని కుర్చీలో కుదేశాను.

రాత్రి తినటానికి ఏమయినా దొరుకుతుందో లేదో, ఏ ఇంటి అరుగుమీద పడుకోవాల్సి వస్తుందో అని భయపడ్డ నాకు ఇంతటి అపురూపమైన ఆతిథ్యం లభిస్తుందని ఊహించనైనా లేదు.

ఒక అరగంటకి పదేళ్ళ పిల్ల మరచెంబు, గ్లాసులతో నీళ్ళు తీసుకొని వచ్చింది. ఆమె వెనకాలే ఒక 'ట్రే'లో భోజన పదార్థాలన్నీ అమర్చి తెస్తూ ఇంతసేపు నే నెదురు చూసిన ఆ ఊహాసుందరి ప్రత్యక్షమయింది! ఆమె నా ఊహలలో మాత్రమే సుందరి కాదు. సృష్టిలోని సౌందర్యమంతా ఆ రూపం ధరించి వచ్చిందా అన్నట్లుంది.

అమృత కలశాన్ని చేబట్టి వచ్చిన మోహినిలా ఆమె నా దగ్గరికి వచ్చింది. తటిల్లతలా ఒక్క చూపు నా వైపు విసిరింది. ఆమె ముఖ పద్మంలో మృదుమందహాసం వెల్లి విరిసింది. నేను తెలివి తెచ్చుకునేసరికి ఆమె 'ట్రే'ని బల్లమీద పెట్టి వెంటనే వెళ్ళిపోయింది. నేనొక్క నిమిషమే ఆ ఆనందాన్ని అనుభవించగలిగాను.

గాఢంగా నిట్టూర్చి భోజనం మీదకి దృష్టి పోనిచ్చాను. విందు భోజనంలా వుంది. అంత రుచికరమైన భోజనం నేనెప్పుడూ తినలేదు. అంతటి తృప్తి, హాయి నేనెప్పుడూ పొందలేదు.

వంటపూటింట ఇంత అపురూపమైన విందుభోజనం నేనెప్పుడూ చేయగలుగుతానని ఊహించలేదు. ఇప్పుడీ ఆతిథ్యానికి ఏం విలువ కట్టగలను?

ఆలోచనలు ఆపుచేసి ఆ మెత్తని పరుపుమీద నడుం వాల్చాను.

రాత్రి పడుకోబోయేముందు ఏదయినా పుస్తకం చదవటం నాకలవాటు. ఆమె పంపిన తాంబూలం తియ్యతియ్యగా పెదవుల్ని రంజితం చేస్తోంది. జేమ్స్‌బాండ్ నవల ఒకటి తీసి మడతపెట్టిన పేజీనుంచి చదవనారంభించాను.

కథ మంచి రసపట్టులో ఉండగా తలుపు చప్పుడయి ఉలిక్కిపడ్డాను. తలుపు తెరుచుకొని లోపలికి అప్సర అడుగుపెట్టింది. ఆమె రాకతో ఆగదిలో ఒక వింత వెలుగు ప్రసరించింది. చిరునవ్వులు పూలవానగా కురిపిస్తూ, కలువరేకుల కన్నులనుండి సుధాస్రవంతులు పొరలిస్తున్నదామె....ఆమె చేతిలోని పాలగ్లాసుక్కూడా అందం వచ్చింది. ఆకర్షించటం ఆమె కళ్ళకే తెలిసినట్లు అందంగా నవ్వుతోంది ఆమె. అలా అచేతనంగా ఆమె స్నిగ్ధ సౌందర్యామృతపానంలో ఎంతసేపుండిపోయానో నాకు తెలియదు.

'మీ.... నోరు సగం కోసిన టొమేటో పండులా వుంది....' అంది ఆమె నవ్వుతూ.

నాకు నవ్వు వచ్చింది. అలా ఆమె కళ్ళలోకి చూస్తూండిపోయాను.

'....ఏమిటలా కళ్ళతో తినేస్తున్నారు?' ఆమెకు కవ్వింపు మాటలు కూడా బాగా వచ్చున్నమాట! అప్పటికి వంటిమీద స్పృహ కలిగింది.

ఆ సమయంలో అలా అందాలు చిందిస్తూ ఆమె అలంకరించుకుని రావటంలోని గూఢార్థం అర్థం చేసుకోలేనంత అమాయకుడిని కాదు నేను!

'....మీకు మాటలు రావని నాకు తెలియదు.'

'వచ్చు. ఎలా మొదలు పెట్టాలా అని చూస్తున్నాను.'

'మొదలు పెట్టడమే మీ వంతు. తర్వాత అదే సాగిపోతుంది.'

'అవసరమైనంతవరకే అందుకోటం, అందించటం నాకలవాటు.'

'కొన్ని విషయాల్లో ఆ అలవాటు మార్చుకోవాలి' ఆమె అలవోకగా నవ్వింది.

ఆమె సౌందర్యామృతపానంలో మత్తెక్కిన కళ్ళని బాగా తెఱచుకొని చూశాను. సౌందర్యం వెనక ఏదో జ్వాల నాలుకలు చాచుకొని ఆహ్వానిస్తోంది. దానిలో పడి ఆహుతి కాబోతున్నానేను!

ఆమె పాలగ్లాసు చేతికందించబోయింది.

'తర్వాత త్రాగుతాను.'

ఆమె ముఖంలో ఓటమిని స్పష్టంగా చూశాను. వెంటనే చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నది. ఒక్కడుగు నావైపు వేసింది. ఆమె వలపు తూపులతో వేడెక్కిన నరాలు అప్పుడసహ్య భావంలో ముడుచుకున్నాయి. వలచి వచ్చిన ఆడది ఆమె!

'....మీకు కళ్ళతో మాట్లాడడం బాగా తెలుసు.'

'ఊహుఁ! నాకా శక్తి లేదని నా భార్య అంటూంటుంది.'

ఆమె ముఖం వెలవెలబోయింది. మంచి షాక్ తినిపించానని లోలోపల నవ్వుకున్నాను. కాని, ఆమె తక్కువ తినలేదు. మరుక్షణంలో నిలద్రొక్కుకొని సవాలు చేసింది.

'....నేనా మాట కొప్పుకోను. అందమైన ఆడపిల్లని అరగంటసేపు కళ్ళతో చూస్తూ గడిపివేయగల మీవంటి వాళ్ళకు అటువంటి శక్తి లేదంటే ఎవరు నమ్మగలరు?' అని అంటూ చాలా దగ్గరగా వచ్చింది ఆమె.

మరుక్షణంలో ఆమెను నేను కౌగిట్లో బంధించేస్తానని అనుకున్నదేమో మత్తుగా కళ్ళు మూసుకుంది. కాని, వెంటనే గగుర్పాటుతో కళ్ళు తెఱచి వింతగా నావైపు చూసింది.

'ఈ పూట గది అద్దెకు, భోజనానికి ఎంతివ్వాలి నేను? రేప్రొద్దునే వెళ్ళిపోతాను' అని అన్నాను తాపీగా.

వేటగాని వడిశెల దెబ్బ తగిలింది. గాయపడిన జింకపిల్ల గిలగిలలాడింది. కంపితాధరాలు, అశ్రుసిక్త నయనాలు, అవమాన భరితమైన ఆ ముఖాన్ని మరింత చిన్నబుచ్చాయి. ఆమె నిజరూపం నాకళ్ళముందు ప్రత్యక్షమయింది. పశ్చాత్తాప హృదయంతో ఆమెను అనునయిం చాలనుకున్నాను కాని, అప్పటికే ఆ గులాబి వాడిపోయింది.

'.....నేను మూఢురాల్ని! మిమ్మల్ని అవమానించి నన్ను నేను చంపుకున్నాను. నన్ను క్షమించండి...." ఆమె గిరుక్కున వెనుదిరిగి గదిలోంచి వెళ్ళిపోయింది. ఏదో అడగాలని నోరు తెరవబోయాను. కాని, నా పిలుపు నా గొంతులో ఉండగానే ఆమె వెళ్ళిపోయింది. ఆమె గద్గద స్వరం చెవుల్లో గ్రింగురుమంటూనే ఉంది.

ఆ రాత్రి ఎంతసేపటికీ నాకు నిద్ర పట్టలేదు. అంత అందమైన స్త్రీ తావలచి వరించి వచ్చినప్పుడు నేనెలా నిగ్రహించుకోగలిగానో ఆ తర్వాత నాకే ఆశ్చర్యం కల్గించింది.

సృష్టిలోని సౌందర్యమంతా మూర్తీభవించినట్లున్న ఆ స్త్రీని ఒక నీతిలేని పడుపుకత్తెగా చూడటం నా మనస్సు సహించలేకపోయింది. కాని, మనస్సులోని శేష ప్రశ్న మాటేమిటి? ఆమె అందచందాలు చూసి ఎవరో ఒకరు ఈ పాటికి పెళ్ళాడి ఉండేవారు గదా! – తానెందుకు ఈ నికృష్టమైన జీవితానికి అలవడిపోయింది? ఆమెనిందుకు ప్రోత్సహించి స్టేషను మాస్టరు వెంకన్న మద్దతుతో డబ్బు చేసుకుంటున్నాడేమో! లేక తన కుటుంబ పోషణకోసం ఆమె పథవిహీనురాలైందా! ఇవి జవాబు దొరకని ప్రశ్నలు. జవాబులు తెలిసినా అవి భరించలేని జవాబులు అవుతాయి!

ఆమెపై సానుభూతితో నా హృదయం ద్రవించి పోయింది.... ఎప్పుడో అర్ధరాత్రి వేళకు నిద్రపట్టింది.

అలవాటు చొప్పును తెల్లవారుఝామునే మెలకువ వచ్చింది. కాలకృత్యాలు ముగించుకు వచ్చేసరికి వేడినీళ్ళు సిద్ధంగా వున్నాయి. స్నానం చేసి వచ్చేసరికి కాఫీ తయారయింది. నా ఎదుట పడకుండానే ఆమె అన్నీ సమకూరుస్తోంది. ఆఖరికి బయలు దేరి వెళ్ళేప్పుడయినా ఆమె ఎదుటపడితే బాగుండును!

కాని ఆమె రాలేదు. మురళిని పిలిచి, 'మీ అక్కని పిలు బాబూ! డబ్బు ఎంతో చెప్తే యిస్తాను' అన్నాను.

పావుగంట తర్వాత ఆ అబ్బాయి తిరిగివచ్చి ఒక కవరు చేతిలో పెట్టి 'అక్క మీకివ్వమంది' అన్నాడు.

ఆశ్చర్యపడుతూ ఆ కవరు విప్పాను. ముత్యాల సరాలుగా వున్న ఆ అక్షరాలు విషాదభరితంగా ఉన్నాయి. అందులోని ప్రతి అక్షరం కన్నీరు పెడుతోంది.

శ్రీ.....

మీ పేరు నాకు తెలియదు. పోనీ, 'దేవుడ'ని పిలుచుకుంటాను. నేను పతితురాల్ని. దేవుడి ఎదుటకు పతితురాలినై ఉండి ఎలా రాగలను? నన్ను క్షమించరూ!

రాత్రి నా ప్రవర్తన చూసినప్పుడు మీరు నేనెంత 'అసహ్యకరమైన స్త్రీనో అర్థం చేసుకొని ఉంటారు. స్త్రీ జాతికే తీరని కళంకాన్ని తెచ్చానని భావించి వుంటారు. కాని, నా ఈ భార్యకు ఏ విధి శాపం ఇచ్చిందో మీ సహృదయం తెలుసుకో కోరినప్పుడు నా మనస్సుకు కొంత ఓదార్పు కలిగింది. అందుకనే మీ సందేహ నివృత్తికోసం మనస్సులోని నాలుగు మాటల్ని మీ ముందుంచుతున్నాను.

మా గురించి వెంకన్న చెప్పే కథల్లో మీరొకటి విని వుంటారు. అందులో కొంత నిజం లేకపోలేదు. పక్షవాతంతో తీసుకుంటున్న తండ్రి, ముగ్గురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు.... వీళ్ళనందర్నీ పోషించవలసిన బాధ్యత నాపై ఉంది. అది నిజం.

అందరికీ హక్కు భుక్తమవుతున్న అందం తప్ప ఆస్తిపాస్తులు, ఆదుకునేవాళ్ళు లేని నిర్భాగ్యురాల్ని నేను. అశక్తులైన నాన్నగారికి, పసిపిల్లలకు గుప్పెడన్నం పెట్టలేని స్థితిలో ఉన్న నన్ను నా అంత కూతురికి పెళ్ళిచేసి, అత్తవారింటికి పంపిన సుందర రామయ్యగారు తను పెళ్ళాడమని - దాని వల్ల నా కుటుంబాన్నంతా పోషించి పిల్లల్ని పెంచి పెద్దవాళ్ళను చేస్తానని ప్రోత్సహించారు.

ముందు నేనొప్పుకోలేదు. సిగ్గు చంపుకొని వంట పూటిల్లు నడిపి అపహాస్యాలకు లోనయి - అప్పులపాలయ్యాను. అదే సమయంలో గురిచూసి ఆయన కొట్టిన దెబ్బకు ఆహుతి అయిపోయాను. నా వాళ్ళను ఆకలికాహుతి చేయలేక అన్నికోరికల్ని చంపుకొని ఆయనకర్ధాంగి నయ్యాను.

అక్కడితో నా కష్టాలు గట్టెక్కలేదు. ఇంతమంది తన జీతంతో పోషించటం సాధ్యం కాదని, పట్నంలో తన సంసారంతో ఉంటున్న కొడుక్కి డబ్బు పంపాలంటే మేమంతా శనిలా దాపురించామని ఆయన సాధించటం మొదలు పెట్టారు.

ఓ రాత్రి ఒక యువకుని తీసుకువచ్చి, అతనికి భోజనం పెట్టమన్నారు. పెట్టాను. పడకగదిలో అతనికి పక్క వెయ్యమన్నారు. వేశాను. ఆయన చెప్పినదల్లా చేయగలిగాను కాని, ఆ యువకునికి నన్నుకూడా అర్పించుకోమన్నారు. అప్పటికి కాని ఆయన మాటల వెనుకనున్న దురుద్దేశ్యాన్ని తెలుసుకోలేకపోయాను.

నా గుండెలు బ్రద్దలయినాయి. ఏ స్త్రీ కూడా భర్తనుండి అటువంటి మాటలు విని బ్రతికి ఉండలేదేమో! నేను శిలాప్రతిమను కనుకనే ఇన్ని అవమానాలు సహించి జీవచ్ఛవంలా బ్రతక కలిగాను.

'.... వయసు మళ్ళిన నేను నీకెలాగూ సుఖమివ్వలేను... ఆ వచ్చినవాడూరికే రమ్మనటం లేదు.... నెల రోజులు ఉద్యోగం చేస్తే ప్రభుత్వం కడుగుడురాళ్ళు చేతుల్లో పెడుతోంది.... ఇటువంటి రెండు ఛాన్సులు....'

ఛీ! ఇంకా అభిమానం చంపుకొని ఆ నీచ హృదయుడన్న మాటల్ని ఏమని చెప్పగలను? అటువంటి మాటలన్నీ జీర్ణించుకొని అంతరాత్మను చిత్రవధ చేసుకున్నాను నేను. తన మాట వినకపోతే మమ్మల్నందర్నీ వదిలేసి తన కొడుకు దగ్గరికి వెళ్ళిపోతానన్నారు. నేనెవరితోటో నీచ సంబంధం పెట్టుకున్నానని ప్రచారం చేసి మరీ పోతానన్నారు. నా వాళ్ళంతా మలమల మాడిపోయేలా చేస్తానన్నారు. ఆయన బెదిరింపులకు హడలిపోయాను.

ఆ రాత్రే నేను చచ్చిపోదామనుకున్నాను - కాని, నా వాళ్ళనందర్నీ అనాథుల్ని చేయటం నాకు మహా పాపమనిపించింది. కనీసం నా పెద్ద తమ్ముడు మురళి ఎదిగి వచ్చి కుటుంబ పోషణ చేసుకోగల శక్తివంతుడు కావాలి. అంతవరకు నేను బ్రతకక తప్పదు.

నేను పెద్దగా చదువుకోలేదు. నాకెవరూ ఇక్కడ ఉద్యోగం ఇవ్వరు... ఆయన్ని కాదని ఉద్యోగం సంపాదించగల శక్తి నా కెక్కడిది? ఎక్కడికయినా వెళ్ళి ప్రయత్నించటానికి ఈ కుటుంబాన్ని అంతవరకు ఆదుకునే దెవ్వరు?

అప్పుడిక ఆయన చెప్పినదానికి తలవొగ్గక నాకు గత్యంతరమేముంది?

నా మనస్సు విరిగిపోయింది. నా అందంపై మక్కువ, నా పవిత్రతపై విలువ, నా అదృష్టంపై ఆశ అన్నిటిని పోగొట్టుకొని జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను.

ఇంతవరకు నన్ను చూసి నిగ్రహంతో నిలబడిన వాళ్ళెవరూ లేకపోయారు. నన్ను చూసిన వెంటనే మతి పోగొట్టుకున్నవాళ్ళే అందరూ! అందర్ని బొమ్మల్లా ఆడిస్తున్నందుకు నాకు కసితో కూడిన గర్వంగా ఉండేది.

కాని, నిన్నరాత్రి మీ ముందు ఓడిపోయాను. నా అందం, ఆకర్షణ మిమ్మల్ని కదలించలేదు. నా మాటలు, నా నవ్వులు కవ్వించలేదు. నాకు సవాలుగా మీరు పెళ్ళి చేసుకున్నట్టు అబద్ధం

చెప్పారు. ఎంత పతితురాలనైనా ఇతరుల మనసుల్ని గ్రహించే ఇంగితజ్ఞానం నాలో దైవం మిగిల్చాడు.

మీ ఉదాత్తమైన హృదయానికి జోహారులర్పిస్తున్నాను. మీ పవిత్ర హృదయంలో ఈ నిర్భాగ్యురాలి కోపం ఒక నిట్టూర్పు దాగి ఉందని భావిస్తున్నాను. నన్నసహ్యించుకోవద్దని - నా ప్రవర్తనకి క్షమించమని వేడుతూ -

- అభాగిని.'

నా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. చుట్టూ కలయజూశాను. మురళి తప్ప ఎవ్వరూ లేరు. ఆ పిల్లవాడి కళ్ళల్లోని దీనత్వానికి చలించిపోయాను. ఆ ఇల్లంతా శోక సముద్రంలో మునిగినట్టుగా ఉంది.

లోపల ముసలితండ్రి మూలుగు, పిల్లల ఏడుపు వినిపిస్తోంది. ఆమెని చూడాలని, ఒక్కసారి ఆ కన్నీళ్ళను తుడిచి ధైర్యం చెప్పాలని, ఆమె నీకూపం నుంచి రక్షించాలని.... ఏదేదో అనుకున్నాను.

ఏదీ చేయలేకపోయాను.

ఆమెకు మరో ఆశ్రయం కల్గించటానికి తావులేదు, ఆమె సుందరరామయ్య భార్య!

అవినీతికరమైన సంపాదన లేకుండా తన కొడుక్కి వేలాది రూపాయలు సుందరరామయ్య ఎలా పంపగలిగాడు? ఈ ఆచూకీ తీయటానికి ప్రభుత్వం చేత పంపబడిన నేను వేరే ఆధారాలకోసం వెదకవలసిన అవసరమేముంది?....ఈ ఒక్క ఉత్తరం చాలదూ?

కాని, ఇది నేను బయటపెడితే ఆమె గతేమిటి? ఆమెపై ఆధారపడిన ఆ పెద్ద సంసారం గతేమిటి?.... ఇప్పుడు నేనేం చేయాలి?

ఒక్క నిముషంపాటు విమూఢుడినయిపోయాను. మరునిమిషంలో గబుక్కున ఆ పిల్లవాడి చేతుల్లో ఆ ఉత్తరంతోపాటు రెండు వందలు పెట్టి వడివడిగా అడుగులు వేస్తూ బయటకు నడిచాను.

ఆమె విశాల నేత్రాలు ఎక్కడినుంచో నన్ను పరీక్షిస్తుంటాయని నాకు తెలుసు!

రైలు టిక్కెట్లు, చిల్లర నా చేతుల్లో పెడుతున్న స్టేషను మాస్టరు సుందర రామయ్య వికృతమైన నవ్వు నా గుండెల్ని మండించింది.

'.....వచ్చిన పని అయిపోయిందా.'

'....ఆ....కాలేదు....లేదు.... అయిపోయింది-'

తడబాటుతో రైల్లో కూర్చున్న నేను మనసులో అనుకున్నాను. 'నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ స్త్రీ సహృదయమే నిన్ను కాపాడుతోంది సుందరరామయ్యా!..... ఒకనాటికి నీ పాపం పండుతుంది.... ఆనాడు నాలాంటి సిబిడిల కంటే మేటియైన విధినుంచి నువ్వు తప్పించుకోలేవు - ఆనాడు నీ నవ్వు నిన్నే భయపెడుతుంది.'

●